క్లుప్తంగా

నేడు మండల సమావేశం

సదుం: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ ఎల్లప్ప అధ్యక్షతన నిర్వహించను న్నట్టు ఎంపీడీఓ రాజశేఖర్ బాబు తెలిపారు. అధికారులు, సభ్యులు హాజరు కావాలని కోరారు.

మురుగు కాలువ నిర్మించరూ!



జగనన్న కాలనీలో నిలిచిపోయిన వర్షపు నీరు

రొంపిచెర్ల: మండలంలోని బండకిందపల్లె గ్రామ పంచాయతీ మట్లోళ్లపల్లెలోని జగనన్న కాలనీలో మురుగు నీటి కాలవను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి వర్షపు నీరు కాలనీలో నిలిచిపోవడంతో కాలనీ నుంచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జగనన్న కాలనీలో 70 కుటుంబాలు ఉన్నాయి. కాలనీకి పక్కనే నేషనల్ హైవే పనులు చేస్తుండడం, కాలనీ పక్కనే సుమారు 15 అడుగుల ఎత్తు వరకు రోడ్డు ఎత్తు పెంచడంతో కాలనీలో నీరు బయటపోకుండా నిలిచి పోయిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించి, కాలువ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

టీకాలు వేశారు



టీకా వేస్తున్న డాక్టర్ గిరీషా

సదుం: మండలంలో వయోజన క్షయ టీకా కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించినట్టు చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ గిరీషా తెలిపారు. మండల కేంద్రంలో ఆమె టీకాలు వేసి మాట్లాడారు. 18 ఏళ్ల నిండిన వారు, గతంలో టీబీ వచ్చి తగ్గిన వారు, ధూమపానం అలవాటు ఉన్న వారు, మధుమేహం రోగులు టీకా వేయించుకోవాలని కోరారు. టీకా వేసే ప్రదేశంలో మచ్చ, బొబ్బ ఏర్పడితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

సీబీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ




జీవిత్, సోమశేఖర్

శాంతిపురం: సీబీఎస్సీ పదవ తరగతి పరీక్షల్లో శ్రీ పరమహంస యోగానంద విద్యాలయ విద్యార్థులు వరుసగా 19వ సారి కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ తెలిపారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ విడుదల చేసిన ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు సి.జీవిత్ 458/500, పి.వి.సోమశేఖర్ 457, టి.మల్లీశ్వరి 453 మార్కులు పొందారని చెప్పారు. మొత్తం 39 మంది విద్యార్థులలో డిస్టింక్షన్ మార్కులతో 20, ఫస్ట్ క్లాసులో 11, సెకండ్ క్లాసులో 8 మంది పాసయ్యారన్నారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను విద్యాలయ చైర్మన్ గోపాల్ అగర్వాల్, జాయింట్ కరస్పాండెంట్ రాధాకృష్ణన్ అభినందించారు.

అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు



మహేష్ యాదవ్‌ను పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

యాదమరి(బంగారుపాళెం): మండలంలోని మాదిరెడ్డిపల్లెలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మహేష్ యాదవ్‌ను గురువారం పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డితో కలిసి పరామర్శించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మహేష్ యాదవ్‌పై టీడీపీ నాయకులు దాడి చేసి గాయపరిచారు. ఈ నేపథ్యంలో బాధితుని ఇంటికి వెళ్లి సునీల్‌కుమార్ పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అండగా ఉంటామని, అధైర్యపడ వద్దని భరోసా ఇచ్చారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన వ్యాన్

- తప్పిన పెనుప్రమాదం

శ్రీరంగరాజపురం : పొలంలోకి వ్యాన్ దూసుకెళ్లిన సంఘటన మండలంలోని ముద్దుకుప్పం గ్రామం వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పళ్లిపట్టు నుంచి చిత్తూరుకు వస్తున్నా వ్యాన్ చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారి ముద్దుకుప్పం గ్రామం వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పొలంలోకి దూసుకువెళ్లింది. ఆ సమయానికి రోడ్డుపై ప్రయాణికులు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌ఐ రాజాకుల్లాయప్ప మాట్లాడుతూ ఎవరైనా వాహనదారులు మద్యం సేవించి, లైసెన్స్ లేకుండా నిర్లక్ష్యంగా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు. అనంతరం ట్రాన్స్‌కో అధికారులు యుద్ధప్రాతిపదికన విద్యుత్ స్తంభాన్ని మార్చారు.

ఆశలతో రబీ



పలమనేరు మండలం పెంగరగుంట వద్ద వరిని కోసి నూర్పిడి చేస్తున్న యంత్రం



దుక్కుల పనుల్లో రైతులు

- రైతన్నల పొలం బాట
- వేసవి దుక్కులకు అదునుగా మారిన వర్షం
- వేరుశనగ విత్తనాల పంపిణీకి ఆర్బీకేలు సిద్ధం
- మొదలైన వరికోతలతో రైతులు బిజీబిజీ
- జూన్ వరకూ కూలీలకు చేతినిండా పనులు

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో తొలకరి వర్షాలు కురుస్తున్నాయి. ఫలితంగా ఈ ప్రాంత రైతన్నలు రబీ సీజన్‌లో ఎన్నో ఆశలతో వ్యవసాయ పనులకు సన్నద్ధమవుతున్నారు. వర్షాధారిత పంటగా ఖరీఫ్‌లో వేరుశనగ సాగుకు రైతులు పూనుకుంటున్నారు. ఇక నీటి వసతి ఉండి వరి సాగుచేసిన రైతులు పంట కోతల్లో బిజీగా ఉన్నారు. ఎన్నికలు ముగియగానే పల్లెలో సేద్యం పనుల హడావిడి కనిపిస్తోంది. మరోవైపు వ్యవసాయ కూలీలకు చేతినిండా పని దొరికినట్టే.

ఖరీఫ్‌లో పెరగనున్న వేరుశనగ సాగు

పలమనేరు వ్యవసాయ డివిజన్‌కు సంబంధించి ఏటా సరాసరి వేరుశనగ 14 వేల హెక్టార్లలో సాగు చేస్తారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దుక్కులు చేసేందుకు ఉద్యుక్తులయ్యారు. దీంతో అదునులో విత్తనాలేసేందుకు సమయం ఉంటుంది. ఫలితంగా ఈ ఖరీఫ్‌లో వేరుశనగను సాగు మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. ఇళ్లలో వేరుశనగ విత్తనకాయలున్న రైతులు వాటిని ఒలిచి సిద్ధం చేసుకుంటున్నారు.

వరికోత, నూర్పిడి యంత్రాల జోరు

వరికోతలకు సీజన్ కావడంతో తమిళనాడు రాష్ట్రం నుంచి వరికోత, నూర్పిడి యంత్రాలు ఈ ప్రాంతానికి చేరుకున్నాయి. వరిని కోసి, నూర్పిడి చేసే యంత్రానికి గంటకు రూ3,500 నుంచి రూ.4వేల దాకా వసూలు చేస్తున్నారు. కూలీల కొరతతో రైతులు యంత్రాలను నమ్ముకుంటున్నారు. దీనికి తోడు నూర్పిడి త్వరిగతిన అవుతోంది.

తీరనున్న గ్రాసం సమస్య

పలమనేరు ప్రాంతంలో ఎక్కువగా పాడి పశువులున్నాయి. ఇన్నాళ్లూ వరిగడ్డి కొని రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు వరిమడుల ఒబ్బిడితో గడ్డి లభిస్తోంది. దీంతోపాటు ఇటీవల కురిసిన, కురుస్తున్న వర్షాలతో పచ్చగడ్డి మొలిచింది. దీంతో మూగజీవాలకు మేత సమస్య చాలావరకు తీరినట్టైంది.

మొదలైన వరికోతలు

ఈ పర్యాయం డివిజన్‌లో 900 హెక్టార్లలో వరి సాగైంది. ఈ ప్రాంతంలో వరికోతలు మొదలవడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. ఎకరా పొలంలో వరికోతలకు 30మంది కూలీల అవసరం ఉంది. భోజనం పెట్టి, రోజుకు కూలీ రూ.500 ఇస్తున్నారు. అలాగే కూలీలు లభించక రైతులు పొరుగునే ఉన్న గ్రామాలకు ఆటోలను పంపి కూలీలను పనులకు రప్పిస్తున్నారు. ముందుగానే బయానాలు ఇచ్చి మరి బుక్ చేసుకోవాల్సి వస్తోంది. కొందరు రైతులు పంటకోత, నూర్పిడులు చేసేందుకు గుత్తలకు ఒప్పిస్తున్నారు.



వరికోత పనులు

వరి కోతలకు కూలీల డిమాండ్



ఈసారి వరి పంట దిగుబడి బాగుంది. కానీ వర్షాల కారణంగా ఎలాగైనా మడులు కోసి ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు తొందర పడుతున్నారు. సీజన్ కావడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. ఇదే సమయంలో తమిళనాడు నుంచి వరికోత యంత్రాలు మాకు అందుబాటులో ఉన్నాయి. వాటికి కూడా ఇప్పుడు డిమాండ్ వచ్చింది. – చందూల్ రెడ్డి, కూర్నాయి

ఇకపై పొలం పనుల్లో బిజీబిజీ



ఎలక్షన్లు అయిపోయినాయి. వానలు బాగా పడతాండాయి. వేరుశనగ కోసం దుక్కులకు వాన అదునుగా పడింది. తారిన వరిమళ్లు కోతలు మొదలయ్యాయి. ఈ రెండు నెలలు రైతులకు బిజీగా పనులుంటాయి. మామిడి తోటలున్న రైతులకు కాయలు దించే సీజన్ మొదలవుతుంది.

– వెంకటరెడ్డి, కల్లాడు, పలమనేరు మండలం

డెంగీపై అవగాహన ర్యాలీ



పలమనేరు : ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

పలమనేరు: డెంగీ బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పలమనేరు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు ఆశ అన్నారు. గురువారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, పగటి పూట కుట్టే దోమల వలన డెంగీ బారిన పడే అవకాశం ఉంటుందని, ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. వారికోసారి విధిగా డ్రైడే పాటించాలని కోరారు. రాత్రి పూట దోమలు ఇంట్లోకి ప్రవేశించకుండా ఉండేందుకు కిటికీలను మూసేయాలను లేదా మెష్‌లు వేసుకోవాలని, దోమతెరలను వాడాలని తెలిపారు. అనంతరం గడ్డూరు, గొబ్బిళ్లకోటూరు, కాకాతోపు అర్బన్ హెల్త్ సెంటర్లలో పెద్దలకు టీబీ రాకుండా వాక్సిన్లను వేశారు. ప్రతి గురువారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని 18 ఏళ్లు పైబడిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో గురువారం డెంగీపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వైద్యాధికారులు విజయ్ చంద్ర, అరుణ్‌కుమార్ మాట్లాడారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, అలాగే పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్లు సావిత్రమ్మ, అనూరాధ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గురువారం రొంపిచెర్లలో డెంగీపై ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ మాట్లాడుతూ, దోమకాటు వలన డెంగీ జ్వరం వస్తుందన్నారు. దోమలు పగటి పూట కుడతాయని చెప్పారు. ఈ వ్యాధిని ఎలిసా పరీక్ష ద్వారా వ్యాధిని గుర్తించవచ్చన్నారు.



బైరెడ్డిపల్లెలో..



రొంపిచెర్లలో..



పుంగనూరు: అడవినాథునికుంటలో..

విపరీతమైన జ్వరం రావడం, ఒంటి నొప్పులు, శరీరమంతా ఎర్రటి దద్దుర్లు రావడం, కనుగుడ్లు వెనుక భాగంలో నొప్పి ఉండటం డెంగీ ప్రాథమిక లక్షణాలను వివరించారు. గ్రామాల్లో దోమలు అభివృద్ధి చెందకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

అడవినాథునికుంటలో..

పుంగనూరు: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీహెచ్ఈఓ మురళి కోరారు. గురువారం మండలంలోని అడవినాథునికుంట ఆరోగ్య కేంద్రంలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రత్నమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఏం రమనన్నా.. ఎట్లుంది మూమెంటు?

- ఏ టీ కొట్టు వద్ద చూసినా ఫలితాలపై చర్చే
- ఏమాత్రం బయట పడని ఓటర్ల నాడి



పలమనేరు: ఎన్నికలు ముగిసి నాలుగురోజులవుతోంది. పట్టణంలోని టీ కొట్లు ఇప్పుడు రాజకీయ చర్చలకు వేదికలుగా మారాయి. ఏ నలుగురు చేరినా రాజకీయ విశ్లేషణలు, గెలుపోటములు, స్టేట్‌లో ఏ పార్టీ వస్తుంది, లోకల్‌గా ఎవరి పరిస్థితి ఏమిటనే మాటలు తప్పిదే మరో మాట లేవు. గంటకు నాలుగు టీలు తాగి కూర్చున్న చోటు నుంచి లేవకుండా పేపర్లు తిరగేస్తూ రాజకీయాలను మాట్లాడుకుంటున్నారు. పట్టణంలో ఇటీవల కొత్తగా పెట్టిన ఓ టీ దుకాణం వద్దకు భాస్కర ఆయనకు రాజకీయ గురువు రమణన్న చేరుకున్నారు. ఏం రమనన్నా..! మనది మూమెంట్ ఎట్లుందినా? అన్నాడు భాస్కర. ఏం అర్థం కాలేదురా భాస్కరా.. నేను నా వయసుకి ఎన్నో ఎలక్షన్లు చూసినాగానీ ఈసారి ఏం బుర్రే పనిచేయాలేదప్పా! అన్నాడు. కాదునా రాజకీయాల్లో నిన్ను మించిన పనోడు లేడని మంచి అనుభవముందని మూడు దినాల్లింకా నీతో మాట్లాడాలని వస్తే నీవు ఈ మాటంటే ఇంగ నా డౌట్ తీర్చేదెవరన్నా? అన్నాడు అమాయకంగా. ఉండ్రా సామీ ఆ పార్టీవోళ్లు మేమే గెలిచేదంటారు..ఈ పార్టీవోళ్లు రిజల్ట్ రాని తెలుస్తుందని చెబ్తారు. ఎవురిమాట నమ్మాల్నో అర్థమే కాలేదే. మా ఊర్లో కొందర్ని ఇంగడిస్తే మగోళ్లేమో అట్టా ఇట్టా బయటపడతాఉండారు. ఈ ఆడోళ్ల మర్మమే తెలియలేదే. ముసలోళ్లని అడిగితే దేనికో వేసిండాంలే అని వాళ్లు బయటపెట్టలేదే. సరే ఈ టెన్షన్ వల్ల నాకు లైట్‌గా తలనొస్తా ఉండాది. ఇంకో టీ చెప్పు తాగేసి ఇంటికిపోతా అన్నాడు. ఈ పరిస్థితి ఓ టీకొట్ల దగ్గరే కాదు..టౌన్, పల్లెలనే తేడా లేకుండా ఏడ జూసినా ఇదే తరహాలో చర్చలు నడుస్తున్నాయి.

పంటలపై ఏనుగుల దాడి



ఏనుగుల దాడిలో దెబ్బతిన్న టమాట పంట

పెద్దపంజాణి: మండలంలోని పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కొంత కాలంగా పెద్దకాప్పల్లి పంచాయతీ పరిధిలోని అటవీ సరిహద్దు గ్రామాలైన కొత్తబూరగపల్లె, తిప్పిరెడ్డిపల్లె, పెద్దకాప్పల్లె, పెనుగొలకల, ముదిరెడ్డిపల్లె, గౌరీనగర్, జిట్టంవారిపల్లె, ఆకులవారిపల్లె గ్రామ రైతుల పంటలను నాశనం చేస్తున్నాయి. బుధవారం రాత్రి కీలపట్ల ఫారెస్టు బీటు నుంచి వచ్చిన ఏనుగులు ముదిరెడ్డిపల్లె పంట పొలాలపై పడి నష్టం కలిగించాయి. ఈ దాడుల్లో టమాట పంటలు ధ్వంసమయ్యాయి. గురువారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలు చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. బాధిత రైతులు అగిస్తి, ఈశ్వరయ్య మాట్లాడుతూ, రూ.50వేల పంట నష్టపోయినట్లు కన్నీటిపర్యంతమయ్యారు. ఏనుగుల దాడుల్లో దెబ్బతిన్న పంటలను రాయలపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్ రవికుమార్ పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపి నష్టపరిహారం మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బండవేషాలతో భక్తుల కేరింత



బండవేషంలో అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా రెండోరోజు గురువారం భక్తులు బండ వేషాలు ధరించి నగరంలో కేరింతలు కొట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు సందడి చేశారు. చిన్నా పెద్ద తేడా లేకుండా అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించారు. కొందరు కుటుంబ సమేతంగా ఆలయం వద్ద పొంగళ్లు పెట్టారు. అమ్మవారి మూలవిరాట్టుకు విశేష పూజలు చేశారు. జాతర రెండవ రోజున తాతయ్యగుంట గంగమ్మ బండ వేషధారణలో భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు తోటి వేషం

తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా మూడో రోజు శుక్రవారం తోటి వేషాలతో గంగమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు. శరీరానికి బొగ్గుపొడి రాసుకుని తెల్లనామం, కనుబొమలపై చుక్క బొట్లు పెట్టుకుంటారు. పిల్లలు మీసాలను కూడా పెట్టుకుంటారు. తలకు రిబ్బన్లు, నడుముకు వేపాకు ధరిస్తారు. పాత పరకలు, చాట చేతపట్టుకుని ఎదురుపడిన వారిని తిన్నగా మోదుతూ ఊరేగుతారు. బూతు పాటలు పాడుతారు. అనంతరం గంగమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారి పాదాల వద్ద వేపాకు, చాట, పరకలు పడేసి బూతులు తిడుతూ కేరింతలతో సందడి చేస్తూ భక్తి పూర్వకంగా మొక్కులు చెల్లిస్తారు.

కేబుల్ దొంగను పట్టుకున్న రైతులు

పలమనేరు: పొలాల వద్ద కేబుళ్లను చోరీ చేసి, వాటిని కాల్చి, అందులోని రాగి వైర్లను విక్రయించి జల్సా చేసే ఓ దొంగోడిని గురువారం రైతులు పట్టుకున్న సంఘటన మండలంలోని ముసలిమొడుగులో చోటుచేసుకుంది. వివరాలు.. రెండు నెలలుగా ముసలిమొడుగు గ్రామ రైతుల పొలాల వద్ద కేబుళ్లు చోరీకి గురయ్యాయి. దీనిపై బాధిత రైతులు స్థానిక పోలీసులకు ఫిర్యాదులు సైతం చేశారు. అయినా చోరీలకు అడ్డుకట్ట పడలేదు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పొలాల వద్ద కేబుళ్లను కాల్చిన వాసన రావడంతో రైతులు వెళ్లి చూడగా అప్పటికే కాల్చి అందులోని కాపర్, అల్యూమినియంను తీసుకెళ్లినట్టు గుర్తించారు. అంతకు ముందు పొలాల వద్ద అనుమానాస్పదంగా సంచరించిన యానాది మల్లికార్జున అలియాస్ మల్లు ఈ పనులు చేసి ఉండవచ్చని అనుమానించారు. దీంతో రైతులంతా కలసి గురువారం పొద్దున్న అతన్ని పట్టుకుని తమదైన శైలిలో నిలదీసేసరికి ఇంతకాలంగా కేబుళ్లను చోరీ చేసింది తానేనని చెప్పాడు. దీంతో రైతులు అతడిని స్థానిక పోలీసులు అప్పగించారు.

పెద్దశేష వాహనంపై కోనేటిరాయుడి చిద్విలాసం

- వేడుకగా తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం
- ఆగమోక్తంగా కార్యక్రమాలు
- కనుల పండువగా ఉయ్యాల సేవ



పెద్దశేష వాహనంపై విహరిస్తున్న కోనేటిరాయుడు

గంగవరం: మండలంలో టీటీడీ అనుబంధ పుణ్యక్షేత్రం కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు గురువారం ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, అర్చన, తిరుచ్చి ఉత్సవం, సర్వదర్శనం, హోమాలు, సాయంత్రం ఉయ్యాలసేవ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. టీటీడీ వేద పురోహితుల మంత్రోచ్చరణల నడుమ మిథునలగ్నంలో ధ్వజారోహణ ఘట్టం దాదాపు రెండు గంటలు పైగా ఆగమోక్తంగా కంకణంబట్టార్ ఏకే. నరసింహాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఘట్టాన్ని వీక్షించేందుకు కీలపట్ల గ్రామం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ధ్వజారోహణం పూర్తయిన తరువాత సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారిని ఉయ్యాలపై కొలువు దీర్చి మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ సేవ నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల మొదటి రోజు శేష వాహన సేవే ప్రధానం. ఆదిశేషునికి స్వామివారంటే ఎంతో భక్తి. కలియుగంలో స్వామివారు కొలువుదీరింది శేషాద్రి కొండపై, ధరించేది శేషవస్త్రం, పానుపు శేషుడు కాబట్టే ఉత్సవాల్లో శేషుడికి అత్యంత ప్రాధాన్యమిస్తూ తొలిరోజు శేష వాహనంపై స్వామివారిని ఊరేగించడమే ఈ వాహన సేవ విశేషం. రాత్రి శ్రీదేవి భూదేవి సమేతంగా సర్వాలంకార భూషితుడైన శ్రీకోనేటిరాయ స్వామివారు పెద్దశేష వాహనంలోకి వేంచేసి గ్రామ మాఢవీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. భక్తులు అడుగడుగునా స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. వాహనసేవ అనంతరం స్వామివారు తిరిగి ఆస్థాన మండపానికి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహన సేవ నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.




శ్రీదేవి భూదేవి సమేతంగా తిరుచ్చి ఉత్సవంపై విహరిస్తున్న కోనేటిరాయస్వామి, ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న వేద పండితులు